# వ్యక్తిత్వాన్ని మరిపించే స్మారకం!



డాక్టర్ సమ్మనూరు రమేష్ బాబు

బాగా జబ్బు పడ్డప్పుడు ఎక్కడో అంతరంలో దాగి ఉన్న చైతన్యం తెలియకుండానే వెలుపలికి వస్తుంది. అప్పుడు ఏదో తపన తహతహ, అర్థంకాని ఆర్తి మనస్సుని దహించివేస్తుంది. ఏదో చెప్పాలని, ఎంతో చేయాలని ఏవేవో రాయాలని ఒకటే ఆరడి. అయితే ఏమీ చెప్పలేని, చెయ్యలేని, చెయ్యి కదపలేని, నోరు మెదపలేని నిస్సహాయ పరిస్థితి కళ్లనిండా నిండుకున్న నీళ్లు పొరలి పడి చెక్కిళ్లమీదగా వెచ్చగా జాగుతున్నప్పుడు, ఎంతో బాధ, వ్యధ కరిగిపోతున్నట్లు అనిపించినా అనుక్షణం రంపపుకోత తప్పదు. యమయాతనని అనుభవించక తప్పించుకోవటం సాధ్యపడదు. జబ్బునుంచి కోలుకోకపోతే హంస ఎగిరే వరకు ఆ అరని వ్రణం అణువణువునూ అహరహం వేధించుకు తింటుంది.

ఈ మాటల్ని వింటూ ఉంటే నా కెంపకోక్లమరి తాతయ్య కళ్లముందు మెదిలాడు.

ఒక్క వెలుగు వెలిగి గ్రుడ్డిదీపమై దిక్కులేని మోడులా యాత్రని ముగించిన ఆయన్ని తలచుకొంటే ఎంతో దుఃఖం కలుగుతుంది.

మనుష్యులు బ్రతికి ఉన్నంతకాలం కోపాలు తాపాలు ఉంటాయి! తీరా చనిపోయాక వాటిస్థానంలోనే సానుభూతి, ప్రేమ చోటుచేసుకొంటాయి. - అని ఎందరో అంటారు కాని, అలాంటిది అనుభవంలోకి వస్తేనే తప్ప ఆ విషయం ఎంతగా గుండెని తొలుస్తుందో అర్థం కాదు !

తాతయ్య చెబుతుంటే ఏదో పిచ్చిగా చెబుతున్నాడని జీవితం పట్ల స్పష్టమైన అవగాహనలేని ఆ రోజుల్లో అనుకొనేవాడిని. ఇప్పుడు ఉందని కాదు.

అయన ఈ లోకాన్ని విడిచి వెళ్లాకే ఆ మాటల సారాంశం బోధపడింది.

అనుభవం ఎంతో గొప్పదే కాదనను, కాని తీరా ఆ అనుభవం వచ్చేసరికి జరగవలసిందంతా జరిగిపోయే ఉంటుంది.

ఏమిటీ పరిస్థితి ?

మానవజీవితం ఇంత అస్థిరమా ? అనిశ్చితమా ? మనస్సు గింజుకొంటుంది. ఆత్మ తన్నుకొంటుంది. అయినా సమాధానం దొరకదు. తెలియదు, తెలిసిరాదు. అందుకే మవునం; మూభావం, ముక్తసరి జీవనం ! జ్యోతిష్యం చెప్పడంలో దిట్ట అనిపించుకొన్న తాతకి ఆయన బ్రతుకు పక్షవాతం పాలవుతుందని తెలియకపోవడం విచిత్రం కాదా ?

కొన్నివేల జాతకాలు గీసిన ఆయనకి తన జాతకంలో ఏముందో తెలియకపోవడం ఆశ్చర్యంగా లేమా !

"ఒరేయ్ ! బాబూ ! అరవై అయిదు, అరవై ఆరు - ఆ వయస్సులో నే వెళ్ళిపోతాన్రా ! మొత్తానికి ఏ జబ్బో చెప్పలేనుకాని బాగా నలిగి ఒంటరిగా విసిగి వేసారి వెళ్ళిపోతాన్రా ! ఇది నిజం !"

ఆయనంటున్నప్పుడు ఆందోళన కలిగేది.

కాని రేపు ఏం జరుగుతుందో ఎవరికి తెలుస్తుంది. అలా తెలిస్తే ఈ మనిషి ఇలా ఎందుకుంటాడు ? - అని సర్దిచెప్పుకొనేవాణ్ణి.

పోనీ అలాగే జరిగితే ....? జరిగితే మాత్రం చేసేదేముంది? ఏం వచ్చినా దానిని ఎదుర్కోవటానికి సిద్ధంగా ఉండక తప్పదుకదా!

"రానున్నది రాకమానదు, కానున్నది కాకమానదు"- మా నాన్నగారు తరచూ అంటూ ఉంటారు. ఈయనకి లౌకికదృష్టి ఎక్కువ. జీవితాన్ని ఒక దృక్కోణంతో మాత్రమే చూస్తారు. అదీగాక నాకూ ఈయనకీ రక్తసంబంధమున్నా అనుబంధం చాల తక్కువ! చిన్నప్పటి నుంచి తాతదగ్గరే పెరగటం చేత ఆయనంటేనే ఎంతో ఇష్టంగా ఉండేది!

"ఎప్పుడూ తాతదగ్గరే ఏం పనిరా?" అంటూ అమ్మ అడుగుతూ ఉండేది.

అమ్మకేం తెలుసు? ఢిల్లీలో రిపబ్లిక్ పెరేడ్, ఆగ్రాలో తాజ్‌మహల్, కాశ్మీర్‌లో ఆపిల్ తోటలు, కన్యాకుమారిలో ఎరుపు సముద్రం - చూసిందన్న గీర ఆమెలో కనిపిస్తూనే ఉంటుంది.

నా కయితే ఆమె చెప్పే వేమీ వద్దు.

తాత అగ్రహారంలో వేదాలు నేర్చుకొన్నప్పుడు ఎలా అల్లరి చేసేవాడో కావాలి.

తాతగారి మాతామహులు త్రివిక్రమాచార్యులు దెయ్యాలని ఎలా ఓడగొట్టేవారో నాకు కావాలి!

మామిడి తోపుల్లో తాత, ఆయన నేస్తాలు కోతికొమ్మచ్చి ఎలా ఆడేవారో నాకు కావాలి.

ఉత్తరాది మఠం స్వాములవారు వస్తే ఎక్కడ ముద్రాధారణ చేయించుకోవలసి వస్తుందోనని తాత పారిపోయినప్పటి కథ కావాలి.

ఇలాగే అన్నీనూ ....

రామాయణం, మహాభారతం, భాగవతం, గీతగోవిందం ఎన్నో చెప్పేవాడు!

అవి వింటూ ఉంటే ఎంతో సంతోషంవేసేది! ఆ సంతోషం నాన్న టార్జాన్‌ని గురించి చెప్పేటప్పుడు కాని, జూలియస్ సీజర్‌ని గురించి చెప్పేటప్పుడు కాని ఉండేదికాదు!

ఎందుకో ఆలా ఆ వయసులో తెలిసేదికాదు. మీ కులమేమిటి? మీ గోత్రమేమిటి? అని అందరినీ అడిగేవాణ్ని. కులగోత్రాలు తెలియని వాళ్లకి ఏమి తెలుస్తుందని తాత అనేవాడు.

నా కులం వాడు, నా గోత్రం వాడు - అని అనుకొన్నప్పుడు ఎందుకో ఆనందం కలుగుతుంది. ప్రతి గోత్రానికి ఒక ప్రత్యేకత ఉంటుంది కదా!

ఎవరికి వాళ్లకి వాళ్ల కులమే, గోత్రమే గొప్పగా ఉండవచ్చు. అంతమాత్రాన ఇంకొకళ్ల కులాన్ని, గోత్రాన్ని కించపరచకూడదు కదా!

ఇదేమాట తాతతో అంటే "ఛాఛ్!" అనేవాడు. మన కులాన్ని మించిన కులం లేదనే వాడు. మాధ్వులకన్న సంస్కారం ఎవరికి ఉంది అని గట్టిగా మాట్లాడేవాడు. అలా ఆయన అనడం నాకు ఇష్టం ఉండేదికాదు. అయితే ఎదురు చెప్పేవాణ్ణి కాదు. చెబితే "అందేకే! ఎంతపొగరురా నీకు!" అంటూ ఎంగిలి కంచంపైన విసరివెళ్ళిపోయే వాడు భోజనం మధ్యలోనే మానేసి!

అంత ఆవేశం!

స్వమతాభిమానం!

నాకు చాలా ఇష్టమైన ఒక వ్యక్తి మాటలో సందర్భంలో "మనకి అంటే ముఖ్యంగా హిందువులకి -

మతం అనేది జీవితంలో ఒకభాగం, అది మనలో జీర్ణించుకుని పోయింది. ఒకవ్యక్తి చెబితేనో లేకపోతే కొన్ని సంస్థలు చెబితేనో విన వలసినంత దుర్గతి మన మతానికిలేదు. మన సంస్కృతిలో ప్రధానమైంది మతమే!"— అని అన్నారు.

ఈ మాటలని తలచుకొన్నప్పుడుకూడా తాతే గుర్తు కొస్తాడు.

ఆయనకి మతమంటే అంతఇష్టం! ఆచారమంటే ప్రాణం!

"తాతా! మడీ, మైలా, నిష్ఠ- ఇవంతా నాకు ఇష్టంలేదు. అవధూతలకి పరమహంసలకి వీటితో నిమిత్తం లేదుకదా?"-అని అంటే

"వెధవా! అవధూతకి పరమహంసకి అర్థంతెలియదు" నీకు! ఏమిటి నువ్వుమాట్లాడేది. అప్రాచ్యుల చదువు చదివి చెడిపో తున్నావ్!" అని గట్టిగా మందలించే వాడేకాని నేను చెప్పేది వినిపించు కునేవాడు కాదు. కాని....

పక్షవాయువు వచ్చి ఎడమచెయ్యి, ఎడమకాలు, నోరు పడిపోయినప్పుడు....

పండిత రాజసంతో మహాదర్పంగా వెలిగే ఆయన ముఖ మందారం కురూపంపాలై విరూపం చెందినప్పుడు.... బిడ్డలు, చివరికి భార్యకూడ అసహ్యించుకొన్నప్పుడు....

స్నేహితులు, చుట్టాలు ముక్కుమూసుకొని దూరంగా జరిగి నప్పుడు...

నీళ్ళునిండిన కళ్ళతో

తడినిండిన గుండెతో

ఆయనలో ఆయనే కుమిలిపోయేవాడు!

ఏదో చెప్పాలని ఏమీ చెప్పలేక మథనపడి పోయేవాడు

ఒంటరిగా దిగులుగా గడిపేవాడు.

విరాగిలా, విరక్తిగా నవ్వుకునేవాడు.

ఆయన భుజమెక్కి ఆయనతోపాటు పౌరోహిత్యాలకి వెళ్ళి దక్షిణలు పుచ్చుకున్న క్షణాలు నా కెప్పటికీ మరపుకు రావు.

పెద్దస్వామీ,చిన్నస్వామీ అని ఎందరో ఆప్యాయంగా పిలుస్తూ ఉంటే అదోరకమైన పెద్దరికాన్ని అనుభవించిన నాకాపిలుపు ఇంకా గుర్తుకుంది.

నాకు ఒంట్లో బాగాలేకపోతే సుందరకాండ పారాయణచేసిన తాత!

నేను దడుసుకొని మూడురోజులైనా లేవకపోతే నరసింహ స్తోత్రం చేసినతాత!

నాకు పాలిచ్చికాని, పాలు తాగని తాత!

అలస్యమైతే బడికి నేరుగా వచ్చే తాత!

అంతటి తాతకి ఒంట్లోబాగాలేక మూలన పడిపోతే వెళ్ళవద్దని ఆంక్ష విధించింది అమ్మ.

అసలు అమ్మ ఆయన కూతురేనా అనిపించేది!

చదువుకోకుండా ఆ ముసలాడిదగ్గరికెళితే ఒళ్ళు చీరేస్తా ననే వాడు నాన్న!

అందరూ ముసలివాళ్ళు కాకుండానే పడచువాళ్ళుగానే ఉండి పోతారా!

ఏడుపు వచ్చేది!

"బాబూ! బాబూ! బాబూ!" అని తాత పిలుస్తూనే ఉండేవాడు.

"చివరికి నీకుకూడా నేను కాకుండా పోయా(నా!"

అని తాత అంటుంటే పిచ్చ ఏడుపు వచ్చేది.

లఘుశంక తీర్చుకోవటానికైనా ఆయనకి తోడు ఉండవల సిందే,

అయన దగ్గరుంటేనే వాసనని పిన్నమ్మ, అప్పా పట్టించుకునే వారు కాదు,

అమ్మని ఎదిరించి, నాన్నమాట కాదని తాత దగ్గిరకి వెళ్ళే వాణ్ణి.

ఆయన నన్ను అక్కునచేర్చుకొని చిన్నపిల్లాడిలా విలపిస్తుంటే దుఃఖంతో గొంతు కూరుకుపోయేది.

ఆయన లాలనలో నాకు ఏంత ఉపశాంతి కలిగిందో చెప్పటా నికి పదాలు చాలవు!

నేను దగ్గరుంటే చాలు అన్నట్లు తాత సంజ్ఞలు చేసేవాడు.

ఒక రోజు....

ఓనమాలు నేర్చుకొంటున్న పిల్లవాని దస్తూరిలా ఉన్న కాయితం ముక్క యిచ్చాడు. అందులో రాసింది చదివాను.

"నీవు చెప్పింది నిజమే! మతాలు, కులాలు, గోత్రాలు అన్నీను మానవ కల్పితాలే! ఏవీ శాశ్వతంకావు. అందరూ పోయేవారే! మనుష్యులంతా ఒక్కటే! ఎవరిది మంచిమనసో, ఎవరికైతే సహనం ఉంటుందో ఎవరికైతే జీవితం అంటే ఏమిటో బాగా తెలుసో! ఎవరికైతే కోరికలని పెంచుకోవటం పాములని పెంచుకోవటం లాంటిదనే విషయం స్ఫురిస్తుందో- వారికి మాత్రమే చావు, పుటక, ఒకేలా కనిపిస్తాయి. నీవు చిన్నవాడివైనా నీకాలక్షణాలు కొన్ని ఉన్నట్లు నాకనిపిస్తోంది. అలాగే ఉండు.

ఇంత చెప్పాకకూడా నాకు కోరిక కలుగుతోంది. నామీద నీకు ఏమాత్రం గౌరవమున్నా, అభిమానమున్నా అలాంటిదే ఇంకేమి ఉన్నా నీమామ కూతురిని పెళ్ళిచేసుకో! చచ్చిపోయిన వాళ్ళు మళ్ళీపుడతారంటారు. అది నిజమైనా కాకపోయినా నేను చచ్చిపోయాక మళ్ళీ నీకడుపులో పుట్టాలని ఉంది. నా మనుమడు, నా మనుమరాలు- వీరికడుపులో పుట్టడంకన్నా, పుట్టి మళ్ళీ సమాజసేవ చేయడంకన్నా మోక్షం ఉంటుందని, వేదాలూ, వేదాంగాలు, శాస్త్రాలు, పురాణాలు తిరగ దోడిన నేను అనుకోవడంలేదు.

ఇది పిచ్చి కోరికని ఎగతాళి చేయకు. పొరపాటుగా కూడ దీన్ని మరచిపోకు"-

నాకు ఆశ్చర్యం వేసింది. దుఃఖం కలిగింది.

"సరే" నని తాతతో అన్నాను. అప్పటి ఆ వెలుగు మళ్ళీనే చూడనే లేదు.

పెద్దచదువులకి పట్నం వచ్చాను.

నేనెలా ఉన్నానని. ఒక్కసారి చూడాలి రమ్మని తాత ప్రతి వాడితో కబురు చేసేవాడు.

వెళ్ళడానికి చార్జీలకు కూడా గతిలేని పేదరికం నన్నావరించింది అప్పట్లో.

తాతకి ధైర్యం చెబుతూ ఉత్తరాలు రాసేవాణ్ణి.

ఒక ఉత్తరంలో—

"తాతయ్యా! నీమాట గుర్తుంది. తప్పక తీరుస్తాను. నాయింటి తలుపులు నీకోసం తెరచుకొంటాయి. అది అర్థరాత్రయినా సరే!"- అని రాసాను.

పట్టలేని సంతోషంతో ఆ ఉత్తరాన్ని అందరికీ చూపినాడు. మీ తాతని నా స్నేహితుడొకడు చెబితే నా కెందుకో ఎంతోహాయి అనిపించింది. అలా కొన్ని నెలలు గడిచాయి.

హఠాత్తుగా ఒకరోజు తంతి వచ్చింది.

"తాత చచ్చిపోయాడు. అర్జెంటుగా రమ్మని!"

భావాలు, అనుభూతులు ఏవీలేక పదినిమిషాలు సరసరమని నడిచాయి.

ఇంటివద్ద ఎవరూ లేకపోతే ఎలా అని అమ్మా, నాన్నా ఇద్దరే వెళ్లారు!

తాతని చూళ్ళేక పోయాను.

కనీసం ఆయన భవుతిక కాయాన్ని అయినా చూడాలని నేను చేసిన ప్రయత్నం ఫలించలేదు. అమ్మకి నాన్నకి ఎంతో చెప్పాను. వాళ్ళు వినిపించుకోలేదు.

మూడవరోజు.... ....  ....

మామయ్య కారు పంపాడు. అమ్మ కూడ వచ్చింది. కర్మ కాండలని ఘనంగా జరపాలని మామయ్య అనుకున్నాడట! అందుకే అందర్నీ రమ్మని చెప్పాడు. తాతలేడు ఆయన శవం కూడా లేదు. ఇక ఎందుకూ వెళ్ళడం అనిపించిది,

కాని వెళ్ళక తప్పలేదు.

"అంత్యక్రియలు ఇంత ఖర్చు పెట్టి జరిపించడాన్ని నేనెక్కడా చూడలేదు అన్నాడొకాయన.

"కర్మకాండలని ఇంత వైభవంగా జరిపిస్తున్నారు. ఆయనకి స్వర్గలోకం తప్పదు." అన్నాడు ఇంకొకాయన.

నాకు ముద్ద మింగుడు పడలేదు.

బ్రతికి ఉన్నప్పుడు దాదాపు వెలివేసారు ఆయన్ని. ఇప్పుడు ఆయనకి స్వర్గం......!

నవ్వు వచ్చింది ఏడుపూ వచ్చింది.

పిత్రుశేషం తినమని వేసారు.దాన్ని చూస్తూ ఉంటే తాతకన్నీటి రూపమే కనిపిస్తోంది.

ఎగదన్నుకొస్తున్న బాధని దిగమింగుకోలేక పోతున్నాను.

ఎవరికి వాళ్ళే సినిమాలకి పిక్నిక్‌లకీ మొదలయ్యారు.

పదిరోజులు గడిచాక సూతకస్నానం!

స్నానం చేస్తూంటేదుఃఖం ఆగట్లేదు. ఈరోజుతో ఇక సూతకం కూడలేదు.

మనిషిని ఎంత త్వరగా మరచిపోతారు ?

భోజనమయ్యాక తాతని కాల్చిన చోటుకి వెళ్లాను. అక్కడ కాస్తా బూడిద ఉంది. నిశ్శబ్దంగా రోదిస్తూ కూర్చున్నాను.

ఈలోగా మామయ్య, నాన్న వస్తూఉండటం చూచి ప్రక్కకి వెళ్లాను.

పురోహితుడు ఏదో తతంగం నడిపాడు.

తరువాత అంతా వెళ్ళిపోయారు!

తిరిగిరాని తాతకోసం, బూడిదైన ఆయన కోసం అక్కడే సాయంత్రం దాకా ఉన్నాను.

ఈలోగా వీరన్న - వాడే కాటికాపరి! - మా బడి వెనకాలే వాటిల్లు! వచ్చాడు.

ఎర్రగా కళ్ళు ఉబ్బిన నన్ను చూచి ఏమనుకున్నాడో!

"చూడు బాబూ! ఎంతో మంది పుడుతుంటారు. ఎంతోమంది చనిపోతుంటారు. ఇది మామూలే ఇక్కడ చూడు ! ఒకటి రెండు మూడు.... .... మొత్తం ఏడుశవాలు కాలినగుర్తులున్నాయి. చనిపోయిన వాళ్ళరారు!మళ్ళీ పుడతారో పుట్టరో కూడ తెలీదు! ఏడ్చి లాభమేమిటి? ఈవేళ మీతాత, రేపు నేను, ఎల్లుండి నీవు! అంతే"

ముందుకెళ్ళిపోయాడు వాడు.... ....  ....

వాడు చెప్పింది అర్థం కాక కాదు, ఆ కఠోరసత్యాన్ని భరించే శక్తి లేక భారంగా వెళ్ళిపోయాను!

ఆ రోజు గడచి ఇప్పటికి పన్నెండు సంవత్సరాలయింది.

తాత చెప్పినట్లే మేన మరదల్ని పెళ్ళిచేసుకొన్నాను. బాబు పుట్టాడు!

తాతయ్యే పుట్టాడని నేననుకుంటాను కాబట్టి నాకెందుకో అప్పు డప్పుడు బాబుని చూచినప్పుడల్లా తాతయ్యని చూచినట్లు ఉంటుంది. నమ్మకం కూడా ఒక సెంటి మెంటేమో! పి.హెచ్.డి. చేసినా ఈ సెంటిమెంటు నన్ను వదల్లేదు. పిచ్చాడి ననుకొన్నా బాధలేదు!